735) సాళంగనాట

ప॥ ఈపెకు నితడు దగు నితనికీపె దగు। చూపులకు పండుగాయ శోభనము నేడు॥

చ॥ పిలువరె పెండ్లి కూతు బెండ్లిపీటమీదకి। చెలగి తానెదురు చూచీ దేవుడు।
బలుపుగా నిద్దరికి బాసికములు గట్టరె। కలిమెల్ల మెరసి సింగారించరే॥

చ॥ ఆతలదెచ్చి పెట్టరె ఆపెండ్లి కూతురును। యీతడే జంట శోభన మిద్దరికిని।
కాతరాన బువ్వానకు గక్కన బెట్టరె మీరు। రేతిట నుండియు వేగిరించేరు వీరు॥

చ॥ పానుపు పరచరె బలునాగవల్లి నేడు। పూని తెరవేయరె పోలతులాల।
ఆనుక శ్రీవేంకటేశుడలమేలుమంగయును। లోననె భూకాంతయును లోలులైరి తాము॥